సాక్షి
ఏలూరు
శనివారం । 4 । నవంబర్ । 2023



వెచ్చని నేస్తాలు వచ్చేశాయి

శీతాకాలపు చలిగాలులు ప్రారంభం కావడంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఊలు వస్త్రాలు విక్రయించే దుకాణాలు వెలుస్తున్నాయి.

10లో ▸



నిట్‌లో టెక్రియ వేడుకలు

తాడేపల్లిగూడెంలోని ఏపీ నిట్‌లో టెక్రియ-2023 వేడుకలు ప్రారంభమయ్యాయి. విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

10లో ▸



బ్యాంకు దోపిడీకి విఫలయత్నం

మొగల్తూరు మండలం పేరుపాలెం నార్త్ గ్రామంలోని యూనియన్ బ్యాంకులో దోపిడీకి దుండగులు విఫలయత్నం చేశారు.

10లో ▸

న్యూస్‌రీల్

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



న్యాయమూర్తి గోపాల కృష్ణారావుకు శ్రీవారి మెమెంటో అందజేస్తున్న ఈఓ త్రినాథరావు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు శుక్రవారం సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ ఈఓ వేంద్ర త్రినాథరావు శ్రీవారి మెమెంటోను, ప్రసాదాలను అందజేశారు. న్యాయమూర్తి వెంట భీమడోలు కోర్టు మేజిస్ట్రేట్ టీఏఎస్ఎస్ఆర్ ఆదిత్య రిషిక్ తదితరులు ఉన్నారు.

వచ్చేనెలలో బాలోత్సవం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎమ్మెల్సీ సాబ్జీ

ఏలూరు(మెట్రో): చిన్నారుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను ప్రదర్శించడంతో పాటు మానసిక ఉల్లాసం, వికాసం పెంచేందుకు బాలోత్సవం దోహదపడుతుందని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం హేలాపురి బాలోత్సవం నాల్గో పిల్లల సంబరాల పోస్టర్‌ను ఎమ్మెల్సీ షేక్ సాబ్జీతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏలూరులోని సురేష్ చంద్ర బహుగుణ (పోలీస్) స్కూల్ వేదికగా డిసెంబర్ 16,17 తేదీల్లో బాలోత్సవం నిర్వహిస్తామన్నారు. ఎమ్మెల్సీ సాబ్జీ మాట్లాడుతూ ఏలూరు నగరం, రూరల్, పెదపాడు, పెదవేగి, దెందులూరు, భీమడోలు, ముసునూరు మండలాల నుంచి 400 పాఠశాలలకు చెందిన విద్యార్థులను ఆహ్వానిస్తున్నామన్నారు. బాలోత్సవం ఆహ్వాన సంఘం అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మ్యూజియం వీఆర్ కృష్ణారావు, నిర్వాహక కార్యదర్శి గుడిపాటి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కృషి



రాకాడ మణి

ఏలూరు(మెట్రో): జిల్లాలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కార్యక్రమాల అమలులో చురుకైన పాత్ర పోషించాలని ఆ శాఖ ఏడీగా బాధ్యతలు చేపట్టిన పి.రాకాడ మణిని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో దివ్యాంగులు, వయోవృద్ధులు, సంక్షేమ శాఖ ఏడీగా బాధ్యతలు చేపట్టిన రాకాడ మణి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న ఆమెను దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఇటీవల ప్రభుత్వం నియమించింది.

ఎస్ఈఏఎస్ పరీక్షకు 28,737 మంది హాజరు



పరీక్షల తీరును పరిశీలిస్తున్న డీఈఓ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను అంచనా వేసేందుకు నిర్వహించిన స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎస్ఈఏఎస్) పరీక్షకు జిల్లావ్యాప్తంగా 28,737 మంది విద్యార్థులు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యామ్ సుందర్ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని 774 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలకు 3వ తరగతి విద్యార్థులు 8,578 మంది, 6వ తరగతి విద్యార్థులు 10,287 మంది, 9వ తరగతి విద్యార్థులు 9,872 మంది హాజరయ్యారన్నారు. డైట్ విద్యార్థులు, కళాశాల విద్యార్థులు 1,248 మంది ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లుగా పర్యవేక్షించారన్నారు. అలాగే 2,035 మంది ఉపాధ్యాయులు కూడా పాల్గొన్నారని తెలిపారు. మూల్యాంకన శనివారం నుంచి ప్రారంభమవుతుందని జిల్లా ఉమ్మడి పరీక్షల సంస్థ కార్యదర్శి అంగులూరి సర్వేశ్వరరావు తెలిపారు.

వైద్య కళాశాల పనులు షురూ

- దగ్గులూరులో చురుగ్గా నిర్మాణ పనులు
- 2025-26 విద్యా సంవత్సరంలో తరగతుల ప్రారంభానికి చర్యలు
- పనులు చూసి సంతోషం వ్యక్తం చేస్తున్న భూములిచ్చిన రైతులు



పాలకొల్లు మండలం దగ్గులూరులో వైద్య కళాశాల నిర్మాణానికి పిల్లర్ల పనులు చేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: ప్రజారోగ్యమే పరమావధిగా, గ్రామీణ విద్యార్థులకు వైద్య విద్యను చేరువ చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతి జిల్లాలోనూ ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటుకు సంకల్పించారు. దీనిలో భాగంగా భీమవరం కేంద్రంగా ఉన్న పశ్చిమగోదావరి జిల్లాకు వైద్య కళాశాల మంజూరు చేశారు. పాలకొల్లు మండలం దగ్గులూరులో వైద్య కళాశాల నిర్మాణానికి రూ.475 కోట్ల నిధులు విడుదల చేశారు. ఎంబీబీఎస్, బీఎస్సీ నర్సింగ్ కోర్సులతో పాటు ప్రత్యేక వైద్య విభాగాలు ఇక్కడ ఏర్పాటు కానున్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలోని 20 మండలాలతో పాటు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ప్రజలకు సేవలందించేలా దగ్గులూరులో వైద్య కళాశాల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

100 మంది నుంచి 61 ఎకరాల సేకరణ

దగ్గులూరులో వైద్య కళాశాల నిర్మాణానికి భూములిచ్చేందుకు రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. సుమారు 100 మంది రైతుల నుంచి ప్రభుత్వం 61 ఎకరాలు సేకరించింది. భూములకు ఆశించిన ధర కన్నా అదనంగా ప్రభుత్వం చెల్లించడంతో రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే పనులు చురుగ్గా సాగడం చూసి సంతోషపడుతున్నారు.

మెగా ఇంజనీరింగ్‌కి పనులు

వైద్య కళాశాల నిర్మాణ పనులను మెగా ఇంజనీరింగ్ సంస్థ చేపట్టింది. ప్రస్తుతం నిర్మాణ ప్రాంతంలో సుమారు రూ.50 కోట్ల విలువైన నిర్మాణ సామగ్రి అందుబాటులో ఉంచారు. పనులు ప్రారంభించిన నాటి నుంచి రెండున్నరేళ్లలో పూర్తిచేసి అప్పగించేలా మెగా ఇంజనీరింగ్ సంస్థ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది.

200 పిల్లర్ల నిర్మాణం

కళాశాల ప్రాంగణంలో 200 పిల్లర్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. దీని కోసం 27 మీటర్ల లోతు, 7.50 అడుగుల వ్యాసార్థంలో పనులు చేపట్టారు. 50 మంది సాంకేతికత, 150 మంది సాంకేతికేతర సిబ్బంది పనుల్లో నిమగ్నమయ్యారు. నిర్మాణ ప్రాంతంలో ప్రత్యేక విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించారు. అలాగే సిమెంట్ మిక్సింగ్ ప్లాంట్ ఏర్పాటుచేశారు. రూ.50 కోట్ల విలువైన యంత్రాలతో పనులు జరుగుతున్నాయి. వాహనాల రాకపోకలకు కోసం తాత్కాలికంగా గ్రావెల్ రోడ్లు నిర్మించారు. 2025-26 విద్యా సంవత్సరంలో కళాశాలలో తరగతులు నిర్వహించే లక్ష్యంతో పనులు చేస్తున్నారు.



సిమెంట్ మిక్సింగ్ ప్లాంట్



విద్యుత్ సబ్‌స్టేషన్

పనుల తీరు బాగుంది



కళాశాలకు భూములిచ్చాం. మా కళ్లముందే మెడికల్ కళాశాల నిర్మాణం తీరు చూసి ఆనందపడుతున్నాం. ప్రస్తుతం పనులు జరగుతున్న తీరు చూస్తుంటే నిర్ణీత సమయం కన్నా ముందే పూర్తవుతాయని భావిస్తున్నాం.

– గుడిమెట్ల మల్లికార్జునరావు, రైతు, దగ్గులూరు

3.40 ఎకరాల భూమి ఇచ్చా..



నేను ఉపాధ్యాయుడిగా పని చేసి పదవీ విరమణ చేశా. చదువు విలువ తెలిసిన వాడిని. కళాశాల నిర్మాణం కోసం భూములు కావాలంటే నా సొంత భూమి 3.40 ఎకరాలు ఇచ్చా. ప్రభుత్వ ధర కన్నా అదనంగా చెల్లించారు. ప్రస్తుతం నిర్మాణ పనులు బాగా జరుగుతున్నాయి.

– ఉద్దరాజు రామచంద్రరాజు, రైతు, దగ్గులూరు

2025-26లో అడ్మిషన్లు



మెగా ఇంజనీరింగ్ సంస్థ నిర్మాణ పనులు చేపట్టింది. సంస్థ ఇచ్చిన కాంట్రాక్టు ప్రకారం 2026కి పనులు పూర్తి చేస్తుందనుకుంటున్నాం. 2025-26లో అడ్మిషన్లు ప్రారంభమవుతాయి. అదే ప్రణాళికతో పనులను పర్యవేక్షిస్తున్నాం.

– శ్రీనివాసరెడ్డి, డివిజనల్ ఇంజనీర్, ఏపీఎంఎస్ఐడీసీ

నిర్ణీత గడువులోపు నిర్మాణం



కళాశాల నిర్మాణ పనులను ఇటీవల పరిశీలించి అధికారులతో మాట్లాడాను. ఇక్కడ జరుగుతున్న పనులకు ప్రతిపక్షాల విమర్శలకు పొంతన లేదు. ఎమ్మెల్యే నిమ్మల చేసే విమర్శలకు అర్థం లేదు. నిర్ణీత గడువులోపు పనులు పూర్తవుతాయి.

– గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి), వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, పాలకొల్లు

ప్రణాళికాబద్ధంగా ఎన్నికల ఏర్పాట్లు

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

ఏలూరు(మెట్రో): రానున్న సార్వత్రిక ఎన్నికలకు ముందస్తు ఏర్పాట్లు ప్రణాళికాబద్ధంగా చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా అన్నారు. శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం నుంచి కలెక్టర్లు, ఎస్పీలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. లా అండ్ ఆర్డర్, చెక్ పోస్టుల ఏర్పాటు, కమ్యూనికేషన్ వ్యవస్థ తదితర అంశాలపై రాబోయే ఎన్నికలకు సంబంధించి సమగ్ర వివరాలు, ముందస్తు ఏర్పాట్లపై జిల్లాల వారీగా ఆయన సమీక్షించారు. ఏలూరు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, ఎస్పీ డి.మేరీ ప్రశాంతి, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధత కార్యాచరణను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎన్నికల నిర్వహణకు మానవ వనరులు, ఎన్నికల సామగ్రి, సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లకు సంబంధించి మ్యాపింగ్, సి విజిల్, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కమ్యూనికేషన్ ప్లాన్ తదితర అంశాలను సమగ్రంగా వివరించారు. ఎన్నికల నిర్వహణకు మూడంచెల భద్రత ఏర్పాటుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు స్టేట్ ఫోర్స్ నియామక ప్రణాళిక, స్ట్రాంగ్ రూం, రిసెప్షన్ సెంటర్ తదితర ప్రాంతాల్లో సెక్యూరిటీ ప్లాన్, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా శాంతి భద్రతల పర్యవేక్షణ తదితర అంశాలను వివరించారు.

ఆకట్టుకుంటున్న ఆక్వా ఎక్స్‌పో



స్టాల్స్‌ను సందర్శిస్తున్న ఫిషరీస్ విద్యార్థులు



ఫీడ్, మందుల గురించి తెలుసుకుంటూ..

సాక్షి, భీమవరం: భీమవరంలో ఆక్వా ఫార్మింగ్ టెక్నాలజీస్ అండ్ సొల్యూషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆక్వా ఎక్స్‌పో ఆకట్టుకుంటోంది. ఆక్వా రైతులకు ఉపయోగపడే సుమారు 85 స్టాల్స్‌ను ఇక్కడ ఏర్పాటుచేశారు. ఆక్వా ఫార్మింగ్ టెక్నాలజీస్ అండ్ సొల్యూషన్ సీఈఓ దంతులూరి వేణు ఆధ్వర్యంలో ఆక్వా రంగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక సెమినార్లు నిర్వహిస్తున్నారు. శుక్రవారం పూర్వపు ఉభయగోదావరి, కృష్ణా జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు, ఫిషరీస్ విద్యార్థులు, పలు కంపెనీల ప్రతినిధులు, రైతులు ఆక్వా ఎక్స్‌పోను సందర్శించి అధునాతన ఆక్వా యంత్ర పరికరాలు, వస్తువులు, సీడ్, ఫీడ్, మందుల వివరాలు తెలుసుకున్నారు. ప్రధానంగా రొయ్యల సాగుకు సంబంధించి సోలార్ ఏరియేటర్స్ ప్రదర్శన, ప్రొబైటిక్స్‌ను రైతులు సొంతంగా తయారుచేసుకునే యంత్రాలు, విద్యుత్ ఆదాకు వినియోగించే ఆక్వా ఎక్సైంజ్, మిక్సింగ్ మెషినరీ, ఫీడ్ తయారీ సామగ్రి, వాటర్ ప్యూరీఫైర్ వంటివి ఆకట్టుకుంటున్నాయి.

ఫిషరీస్ విద్యార్థులకు అవగాహన

పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల్లోని ఫిషరీస్ కళాశాల విద్యార్థులు ఎక్స్‌పోను సందర్శించి ఆక్వా పరికాలు, టెక్నాలజీపై అవగాహన పొందుతున్నారు. ప్రతి స్టాల్‌ను సందర్శించి ఆక్వా సాగు, రైతులకు కలిగే ప్రయోజనాలను తెలుసుకుంటున్నారు. ఫీడ్, మందులు తయారీ స్టార్టప్ కంపెనీలు, మార్కెటింగ్ వివరాలను స్టాల్స్ నిర్వాహకులను అడిగి తెలుసుకుంటున్నారు.

'జగనన్నకు చెబుదాం'తో తక్షణ పరిష్కారం

జేసీ లావణ్యవేణి



కామవరపుకోటలో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న జేసీ లావణ్యవేణి

కామవరపుకోట: గ్రామీణ ప్రాంతాల ప్రజల సమస్యలను తక్షణం పరిష్కరించడమే జగనన్నకు చెబుదాం లక్ష్యమని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి అన్నారు. శుక్రవారం కామవరపుకోట మండలానికి సంబంధించి స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. జంగారెడ్డిగూడెం ఆర్డీఓ కె.అద్దయ్య, ప్రత్యేక అధికారి ఎం.రాజు, డ్వామా పీడీ రాంబాబు, డీపీఓ టి.శ్రీనివాస్ విశ్వనాథ్‌తో కలిసి ఆమె అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రతి సోమవారం జిల్లాస్థాయిలో జరిగే జగననన్నకు చెబుదాం కార్యక్రమానికి హాజరయ్యే జిల్లాస్థాయి అధికారులు మండల స్థాయి కార్యక్రమానికి కూడా హాజరవడం ద్వారా స్థానిక సమస్యలను సత్వరం పరిష్కరించవచ్చన్నారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారం అందించాలని ఆదేశించారు. మొత్తం 132 అర్జీలు అందాయని, వాటిని పరిష్కారం నిమిత్తం ఆయా శాఖల అధికారులకు పంపించామని చెప్పారు.

అర్జీల్లో కొన్ని..

- కామవరపుకోట శివారు పాతూరుకు చెందిన బోడపాటి కనకదుర్గ, కొండగూడెంకు చెందిన లింగాల నాగేశ్వరరావు గ్యాస్ కనెక్షన్‌కు సంబంధించి సమస్యలను జేసీ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఆమె స్పందించి జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి ఆర్.సత్యనారాయణరాజును పిలిచి ఆయా సమస్యల పరిష్కారానికి ఆదేశాలిచ్చారు. దీంతో గంటలోపు వారిద్దరూ గ్యాస్ కనెక్షన్ అందజేశారు.
- జోగడిగూడెం గ్రామానికి చెందిన రోశయ్య తమ భూమిని ఆన్‌లైన్ చేయమని అర్జీ అందజేశారు.
- రామన్నపాలెంకు చెందిన రమాదేవి తమకు ప్రభుత్వ భూమికి పట్టా, పట్టాదారు పాస్ పుస్తకం మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు.
- కామవరపుకోటకు చెందిన నాగేశ్వరరావు తన భూమిని అన్యాక్రాంతం చేసిన వారి నుంచి తన భూమిని అప్పగించమని కోరుతూ అర్జీ అందజేశారు.

జెడ్పీటీసీ కడిమి రమేష్, సర్పంచ్‌లు కె.అనుష, పొన్నాల అనిత, తహసీల్దార్ డీవీ సత్యనారాయణ, ఎంపీడీఓ కె.శ్రీదేవి, జిల్లా, మండల స్థాయి అధికారులు, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో సామాజిక విప్లవం

ప్రభుత్వ విప్, బస్సు యాత్ర కో-ఆర్డినేటర్ అప్పిరెడ్డి



వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి

పాలకొల్లు అర్బన్: సీఎం జగన్ పాలనలో అట్టడుగు వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించడంతో ఆర్థికంగా ప్రయోజనం పొంది వారి జీవన విధానంలో మార్పులు చోటుచేసుకున్నాయని ప్రభుత్వ విప్, బస్సు యాత్ర కో-ఆర్డినేటర్ లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం జరిగిన నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 8న పాలకొల్లులో నిర్వహించే వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రకు అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సీఎం జగన్ చేసిన మేలు తెలియజేయడమే బస్సు యాత్ర లక్ష్యమన్నారు. ఆయా వర్గాలకు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా గుర్తింపు ఇచ్చారని, 50 శాతం నామినేటెడ్ పదవులను ముఖ్యంగా మహిళలకు కేటాయించి సామాజిక విప్లవానికి సీఎం జగన్ నాంది పలికారని స్పష్టం చేశారు.

ప్రణాళికాబద్ధంగా పాలన : వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో మొట్టమొదటగా పాలకొల్లు అసెంబ్లీ సీటు గెలవబోతున్నామన్నారు. వ్యవస్థను ప్రణాళికాబద్ధంగా నడపడం సీఎం జగన్‌కి బాగా తెలుసని అన్నారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) మాట్లాడుతూ బస్సు యాత్ర విజయవంతం చేసేందుకు నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోని ప్రతి కార్యకర్త బాధ్యత తీసుకోవాలని కోరారు. ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బస్సు యాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. నవరత్నాల ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ అంకంరెడ్డి నారాయణమూర్తి, రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనందప్రకాష్, టీటీడీ బోర్డు సభ్యుడు మేకా శేషుబాబు, నియోజకవర్గాల పార్టీ పరిశీలకులు గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ, జెడ్పీటీసీలు నడపన గోవింద రాజుల నాయుడు, గుంటూరు పెద్దిరాజు, ఎంపీపీలు చిట్టూరి కనకలక్ష్మి, సబ్బితి సుమంగళి, కార్పొరేషన్ డైరెక్టర్లు బొడ్డేటి సూర్యనారాయణ, పెదపాటి పెద్దిరాజు, మండల కన్వీనర్లు విప్పర్తి ప్రభాకరరావు, పాత్తూరి బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు సబ్ ట్రెజరీపై ఏసీబీ దాడులు



రికార్డులను తనిఖీ చేస్తున్న ఏసీబీ అధికారులు

ఏలూరు టౌన్: ఏలూరు సబ్ ట్రెజరీ కార్యాలయంలో అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. శుక్రవారం సబ్ ట్రెజరీ కార్యాలయంలో ఆకస్మిక దాడులు చేసి రికార్డులు, నగదును పరిశీలించారు. సుమారు రూ.41 వేలు అనధికారికంగా ట్రెజరీ అధికారుల వద్ద ఉన్నట్టు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఏలూరు ఏసీబీ డీఎస్పీ పి.శరత్‌బాబు మాట్లాడుతూ ఇటీవల కొందరు పెన్షనర్లు సబ్ ట్రెజరీ అధికారుల అవినీతిపై స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారని, ఈ నేపథ్యంలో దాడులు చేసినట్టు చెప్పారు. సీనియర్ అకౌంటెంట్ ఒకరి వద్ద రూ.30,380, మరొకరి వద్ద రూ.4,450, జూనియర్ అసిస్టెంట్ ఒకరి వద్ద రూ.2,570, మరొకరి వద్ద రూ.1,800, అదనంగా మరో రూ.1,800 అనధికారికంగా ఉండటాన్ని గుర్తించామన్నారు. ఈ మొత్తం రూ.41 వేలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఉద్యోగులు, అసిస్టెంట్ సబ్ ట్రెజరర్ సత్యనారాయణను విచారించామన్నారు. అలాగే రికార్డులు కూడా పరిశీలిస్తున్నామని శనివారం కూడా తనిఖీలు కొనసాగుతాయని చెప్పారు. ఏసీబీ సీఐలు నాగేంద్రప్రసాద్, ఎల్‌వీ భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో సబ్‌స్టేషన్లు



సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

ఆకివీడు: జిల్లాలోనే అతి పెద్ద కాలనీగా ఉన్న తాళ్లకోడులోని జగనన్న కాలనీలో విద్యుత్ సౌకర్యం కల్పించామని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు తెలిపారు. రూ.11.20 కోట్ల వ్యయంతో తాళ్లకోడు, గుమ్ములూరు రోడ్డులో నిర్మించిన రెండు సబ్ స్టేషన్లను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ 3,200 మందికి పట్టాలు పంపిణీ చేయగా 1,800కు పైగా ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. వెయ్యికి పైగా ఇళ్ల నిర్మాణం పూర్తికాగా 650 మంది గృహప్రవేశాలు చేశారన్నారు. వీరందరికీ విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకున్నామన్నారు. త్వరలోనే రోడ్లు, డ్రెయినేజీ సౌకర్యం కల్పిస్తామన్నారు. గుమ్ములూరు రోడ్డులో 33 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటుతో ఆక్వా, ఐస్ ఫ్యాక్టరీలు, రైస్‌మిల్లులకు మేలు జరుగుతుందన్నారు. జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు, నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, ఎంపీపీ కఠారి జయలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ ఎస్కే రసూల్‌బీబీ, నగర పంచాయతీ విప్ పడాల శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్లు పుప్పాల పండు, వంగా జ్యోత్స్న, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ పాల్గొన్నారు.

బాలుర హాస్టల్‌లో ఆకస్మిక తనిఖీ



విద్యార్థులకు క్రీడా సామగ్రి అందిస్తున్న సబ్ కలెక్టర్

ముసునూరు: హాస్టల్ ప్రత్యేకాధికారి హోదాలో నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ శుక్రవారం రాత్రి ముసునూరులోని బీసీ బాలుర హాస్టల్‌ను తనిఖీ చేశారు. భోజనం చేస్తున్న విద్యార్థులతో మాట్లాడి భోజన రుచి, శుచిపై ఆరా తీశారు. అనంతరం హాస్టల్ వార్డెన్ షేక్ నజీర్, విద్యార్థులతో విద్యాభివృద్ధి, నడవడిక, ఆరోగ్య పరిస్థితులు, భోజనం, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై ముఖాముఖి నిర్వహించారు. బాలురకు ప్రభుత్వం నుంచి అందాల్సిన సౌకర్యాలు పూర్తిగా అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. గత పర్యటన సందర్భంగా విద్యార్థులకు ఇచ్చిన హామీని సబ్ కలెక్టర్ నెరవేర్చారు. సొంత నిధులతో వాలీబాల్, నెట్, చదరంగం బోర్డులను అందజేశారు. భోజనం రుచికరంగా మెనూ ప్రకారం వడ్డించాలని వార్డెన్‌ను ఆదేశించారు. ప్రతినెలా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. బాలుర హాజరు, ప్రాంగణాన్ని పరిశీలించి, పరిసరాల పరిశుభ్రతపై సంతృప్తి వ్యక్తం చేశారు. తహసీల్దార్ దాసరి సుధ, వీఆర్‌ఓ ఆయన వెంట ఉన్నారు.

వెచ్చని నేస్తాలు వచ్చేశాయి

- జిల్లాలో పెరుగుతున్న శీతాకాలపు చలిగాలులు
- పట్టణాల్లో వెలుస్తున్న స్వెటర్, రగ్గుల దుకాణాలు
- నేపాల్ వర్తకుల స్థానంలో పెరుగుతున్న ఇతర రాష్ట్రాల వ్యాపారుల హవా


ఏలూరు అమీనాపేటలో ఏర్పాటు చేసిన స్వెటర్లు, రగ్గుల దుకాణం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వర్షాకాలం దాదాపు ముగిసి శీతాకాలపు చలిగాలులు ప్రారంభయ్యాయి. తెల్లవారుజామున, సాయంత్రం వేళల్లో ఇప్పటికే ప్రజలకు చలి అనుభూతి కలుగుతోంది. దీపావళి పండుగ అనంతరం చలిగాలులు తీవ్రమయ్యే అవకాశం ఉంది. ఈ తరుణంలో పసిపిల్లల నుంచి పెద్దల వరకు రగ్గులు, స్వెట్టర్లు, జర్కిన్‌లు వినియోగిస్తూ చలి నుంచి రక్షణ పొందుతుంటారు.

వివిధ ప్రాంతాల నుంచి విక్రేతలు..

ఈ నేపథ్యంలో చలి నుంచి రక్షణ కల్పించే ఉన్ని ఉత్పత్తుల దుకాణాలను ఏటా ఇదే సీజన్‌లో ఊరూరా ఏర్పాటు చేస్తుంటారు. చేతితో, యంత్రాలతో తయారుచేసిన ఉన్ని ఉత్పత్తులు, జర్కిన్లు, రగ్గులు, శాలువాలు, చిన్నపిల్లలకు మంకీ క్యాప్‌లు, మహిళలు చెవులకు కట్టుకునే ఊలు వస్త్రాలను తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. వీటితో పాటు చిన్నపిల్లలకు గ్లౌజులు, టోపీలు, నోస్ మాస్కులు, స్కార్ఫ్‌లు కూడా ఉంటాయి. గతంలో నేపాల్ నుంచి వ్యాపారులు వచ్చి ఇక్కడ దుకాణాలు ఏర్పాటు చేసేవారు. అయితే ప్రస్తుతం వారి సంఖ్య తగ్గి ఉత్తర ప్రదేశ్, గుజరాత్, ఢిల్లీ, అరుణాచల్ ప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాపారులే ఎక్కువగా ఉంటున్నారు.

నగరంలో వివిధ ప్రాంతాల్లో..

నగరంలోని వివిధ ప్రాంతాల్లో స్వెటర్ల దుకాణాలు ఏర్పాటు చేశారు. జిల్లా పరిషత్ కార్యాలయం, ఆర్ అండ్‌బీ కార్యాలయం సమీపంలో, కెనాల్ రోడ్డులో టెకు బ్యాంక్ సమీపంలో, సత్రంపాడు, అమీనాపేట, తంగెళ్లమూడి, తాపీమేస్త్రీ కాలనీ వంటి ప్రాంతాల్లో ఈ దుకాణాలు ప్రస్తుతం దర్శనమిస్తున్నాయి.

అందుబాటులో ధరలు..

స్వెటర్లు, జెర్కిన్‌లు, శాలువాలు, మంకీ క్యాప్‌లు వంటివి నగరంలోని వివిధ దుకాణాల్లో లభిస్తున్నప్పటికీ వాటి ధరలు మాత్రం ఎక్కువే. అయితే ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాపారులు సరసమైన ధరలకు వాటిని అందుబాటులో ఉంచడంతో వారి వద్దనే కొనుగోలు చేయడానికి ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. నాణ్యతను బట్టి చిన్నారులకు వేసే స్వెటర్ రూ.200 నుంచి రూ.600 వరకు, పెద్దలకు రూ.400 నుంచి రూ.800 వరకు, రగ్గులు రూ.300 నుంచి రూ.800 వరకు, మంకీ క్యాప్‌లు రూ.100 నుంచి రూ.200 వరకు విక్రయిస్తున్నారు.

మూడు నెలలు వ్యాపారం చేస్తాం



ఉన్ని ఉత్పత్తుల అమ్మకాల కోసం మా ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చాం. వేసవికాలం వచ్చే వరకూ దాదాపు మూడు నెలల పాటు ఇక్కడ వ్యాపారం చేస్తాం. అప్పటివరకు కుటుంబాలకు దూరంగా ఉంటాం. ఇక్కడ ఏర్పాటు చేసుకున్న దుకాణాల్లోనే నివాసం ఉంటాం.

– రాయ్ సింగ్, వ్యాపారి, ఉజ్జయిని, మధ్యప్రదేశ్

ఉపాధి దొరుకుతుంది



చలికాలం ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతున్న కారణంగా వ్యాపారం అనుకున్న స్థాయిలో జరగడం లేదు. చలి కొద్దిగా పెరిగితే ప్రతి రోజూ అమ్మకాలు బాగుంటాయి. ఈ వ్యాపారం వల్ల భారీ స్థాయిలో లాభాలు రాకపోయినా ఉపాధి అయినా దొరుకుతుంది.

– పింటూ బంజారా, వ్యాపారి, ఉజ్జయిని, మధ్యప్రదేశ్

క్లుప్తంగా

బ్యాంకు దోపిడీకి విఫలయత్నం


పేరుపాలెంలోని యూనియన్ బ్యాంకు కార్యాలయం


బ్యాంకు వెనుక భాగంలోని తలుపు, గోడకు చేసిన రంధ్రం

నరసాపురం రూరల్: నరసాపురం ఎస్‌బీఐ బజార్ బ్రాంచ్ కార్యాలయంలో రెండు రోజుల క్రితం రూ.6.50 లక్షల దోపిడీ ఘటన మరువక ముందే మొగల్తూరు మండలం పేరుపాలెం నార్త్‌లోని యూనియన్ బ్యాంకులో గురువారం రాత్రి దోపిడీకి దుండగులు విఫలయత్నం చేశారు. యూనియన్ బ్యాంకు వెనుకభాగంలోని తలుపు, తలుపు వెనుక ఉన్న గోడను బద్దలుగొట్టి దుండగులు బ్యాంకులోకి చొరబడ్డారు. బ్యాంకు లాకరు తాళాలు తెరిచేందుకు దుండగులు చేసిన ప్రయత్నం ఫలించలేదు. స్థానికులు అందించిన సమాచారంతో సంఘటన స్థలానికి ఎస్సై వీరబాబు వెళ్లి పరిశీలించారు. క్లూస్ టీంలను కూడా రప్పించారు. బ్యాంకు సీసీ ఫుటేజీల ఆధారంగా ముగ్గురు దుండగులు దోపిడీకి ప్రయత్నించినట్లుగా ప్రాథమికంగా గుర్తించినట్లు ఎస్సై తెలిపారు. బ్యాంకు మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, త్వరితగతిన నిందితులను అరెస్టు చేస్తామని ఎస్సై తెలిపారు.

నిట్‌లో టెక్రియ వేడుకల ప్రారంభం


డ్రోన్‌లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు


ప్రాజెక్టులను పరిశీలిస్తున్న నిట్ రిజిస్ట్రార్ దినేష్ పి.శంకరరెడ్డి

తాడేపల్లిగూడెం : వినూత్న పరిశోధనలతో నవశకానికి నాంది పలకాలని నిట్ రిజిస్ట్రార్ దినేష్ పి.శంకర రెడ్డి కోరారు. ఏపీ నిట్‌లో టెక్రియ– 2023 వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న రిజిస్ట్రార్ మాట్లాడుతూ విద్యార్థులు తమ ఆలోచనలకు పదును పెడితే అద్భుత ఆవిష్కరణలు సాధ్యమవుతాయన్నారు. పరిశోధనలు దేశానికి దిక్సూచీ వంటివన్నారు. సాంకేతిక రంగంలో ప్రపంచంలో ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. ప్రతిభ, సృజనాత్మకత కలిగిన విద్యార్థులకు తగిన గుర్తింపు, డిమాండ్ ఉంటుందన్నారు. విద్యార్థుల్లో వైజ్ఞానిక స్పృహను పెంచడానికి టెక్రియా వంటి కార్యక్రమాలను నిట్ నిర్వహిస్తోందన్నారు. సమాజ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు కొత్త ప్రాజెక్టులు, ఆవిష్కరణలు చేసి దేశఖ్యాతిని, విద్యనభ్యసిస్తున్న సంస్థ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటాలన్నారు.

ఆకట్టుకున్న ప్రాజెక్టులు

ఇటీవల దేశఖ్యాతిని ప్రపంచానికి చాటిన చంద్రయాన్, సాంకేతిక విప్లవంలో భాగంగా క్షేత్రస్థాయిలో అందుబాటులోకి వచ్చిన డ్రోన్ టెక్నాలజీ, ఇతర టెక్నాలజీలపై విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వీటిని రిజిస్ట్రార్, తదితర అధికారులు పరిశీలించారు. డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ జీబీ వీరేష్‌కుమార్, డీన్‌లు ఎన్.జయరామ్, టి.కురుమయ్య, వి.సందీప్, టి.రమేష్, కిరణ్ తీపర్తి, తపస్ రేష్మా, హిమబిందు, సుదర్శన్ దీప, ప్రోగ్రామ్ సెక్రటరీ జకీర్ ప్రణవ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్టు

125 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం


పట్టుబడిన మద్యం, నిందితురాలితో పోలీసులు

ద్వారకాతిరుమల : మద్యం విక్రయిస్తున్న ఓ మహిళను అరెస్టు చేసి, ఆమె వద్ద నుంచి రూ.18,750 విలువైన 125 క్వార్టర్ బాటిళ్లను శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్టు భీమడోలు సీఐ భీమేశ్వర రవికుమార్ చెప్పారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు కేసు వివరాలు వెల్లడించారు. తిరుమలంపాలెంకు చెందిన గుంపుల ధనలక్ష్మి మద్యం విక్రయిస్తుందన్న సమాచారంతో ద్వారకాతిరుమల ఎస్సై టి.సుధీర్, సిబ్బందితో కలసి తిరుమలంపాలెం గ్రామ శివారులో ఉదయం ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద నుంచి 125 మద్యం క్వార్టర్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని భీమడోలు కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్టు చెప్పారు. జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు, డీఎస్పీ ఇ.శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈ దాడి నిర్వహించినట్టు సీఐ తెలిపారు.

పర్యావరణ హితం.. బ్లాక్ సోల్జర్ ఫ్లై లార్వా


ఆక్వా ఎక్స్‌పోలో వివరాలు తెలుసుకుంటున్న సందర్శకులు


బ్లాక్ సోల్జర్ ఫ్లై లార్వా పురుగులు

సాక్షి, భీమవరం: ఆక్వా సాగులో పెట్టుబడులను తగ్గించుకునేందుకు రైతులే సొంతంగా సహజసిద్ధమైన ఆహారాన్ని తయారుచేసుకోవచ్చని ఔత్సాహిక పారిశ్రామికవేత్త గుంటూరుకు చెందిన యడ్లపాటి రమేష్ చెప్పారు. ఆక్వా ఫార్మింగ్ టెక్నాలజీస్ అండ్ సొల్యూషన్స్ సంస్థ భీమవరంలో ఏర్పాటు చేసిన ఆక్వా ఎక్స్‌పోలో ఆయన రొయ్యలు, చేపలు, పెంపుడు జంతువులు, పక్షులకు ఆహారంగా ఉపయోగించే పురుగులు, కీటకాలను ఉత్పత్తి చేసే స్టాల్‌ను ఏర్పాటుచేశారు. రొయ్యల సాగులో మేతల ధరలు విపరీతంగా పెరిగి కొన్ని సందర్భాల్లో రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. ఈ నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ దోహదం చేసే బ్లాక్ సోల్జర్ ఫ్లై లార్వా వినియోగం వల్ల ఉపయోగాలను రైతులు, సందర్శకులు, విద్యార్థులకు వివరిస్తున్నారు. తక్కువ ధరకు పౌష్టికాహారం అందించడానికి బ్లాక్ సోల్జర్ ఫ్లై లావా దోహదం చేస్తుందని చెబుతున్నారు. కోళ్లు, ఆక్వా, ఇతర జంతువులు, పక్షులకు సహజసిద్ధంగా తయారు చేసే ఆహారాన్ని తక్కువ ధరకు అందించాలనే లక్ష్యంతో బ్లాక్ సోల్జర్ ఫ్లై లార్వాను ఉత్పత్తి చేస్తున్నట్లు చెప్పారు. దీనిని నాటు, బ్రాయిలర్ కోళ్లకు ఆహారంగా వేస్తే వాటి ఆరోగ్యం మెరుగుపడడమేగాక నాణ్యమైన, రుచికరమైన గుడ్లను ఉత్పత్తి చేయవచ్చన్నారు. బ్లాక్ సోల్జర్ ఫ్లై లార్వా ద్వారా 25 రోజుల్లో ఆహారంగా వినియోగించుకునే పురుగును సిద్ధం చేయవచ్చన్నారు. క్రిముల గుడ్ల నుంచి 20 రోజుల్లో లార్వా తయారై తరువాత కీటకంగా మారుతుందన్నారు. పట్టణాలు, గ్రామాల్లోని వ్యర్థపదార్థాలు, కోళ్ల వ్యర్థాల నుంచి బ్లాక్ సోల్జర్స్ ఫ్లై లార్వాను తయారుచేయవచ్చన్నారు. దీనివల్ల పర్యావరణ పరిరక్షణతోపాటు తక్కువ ధరకు రొయ్యలు, చేపలు, కోళ్లు, ఇతర జంతువులకు ఆహారం అందించవచ్చని వివరించారు.

గడపగడపకు సంక్షేమం


ఏలూరు టౌన్: ఏలూరు 11వ డివిజన్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళ సమస్యను వింటున్న ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని


దెందులూరు : సీతంపేటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కె.అబ్బయ్యచౌదరి

పెదఅవుటపల్లి వెళ్లి పింఛను అందజేత


పెదఅవుటపల్లి ఆస్పత్రిలో పింఛను అందజేస్తున్న వలంటీర్ ఆంజనేయులు

మండవల్లి: దూర ప్రాంతంలో ఉన్న లబ్ధిదారులకు సైతం పింఛను సొమ్మును సకాలంలో అందిస్తూ వలంటీర్లు తమ మానవత్వాన్ని చాటుతున్నారు. మండలంలోని కానుకొల్లు గ్రామానికి చెందిన జామిశెట్టి వెంకన్న అనారోగ్యంతో బాధపడుతూ పెదఅవుటపల్లిలో బంధువుల ఇంటి వద్ద ఉంటూ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో వెంకన్న అనారోగ్యం విషయం తెలుసుకున్న వలంటీర్ కొంతి ఆంజనేయులు శుక్రవారం పెదఅవుటపల్లి ఆస్పత్రికి వెళ్లి వెంకన్నకు పింఛను సొమ్ము అందజేశాడు. ఈ విషయంపై వెంకన్న బంధువులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుదాఘాతానికి వివాహిత మృతి

చింతలపూడి: విద్యుదాఘాతానికి గురై ఓ వివాహిత మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. నామవరం గ్రామానికి చెందిన దేశావతు పార్వతి (48) శుక్రవారం ఇంట్లో నూతిలో ఉన్న విద్యుత్ మోటార్‌ను ఆన్ చేస్తుండగా షాక్‌కు గురై స్పృహ తప్పిపడిపోయింది. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి ఆమెను చికిత్స నిమిత్తం చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న ఎస్సై కె.ప్రసాద్ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేసీఆర్ వ్యాఖ్యలపై ఖండన


చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీటీసీ): పేదరికాన్ని ఏపీలో కంటే తెలంగాణలోనే ఎక్కువ తగ్గించామని కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను పశ్చిమగోదావరి జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు చీకటిమిల్లి మంగరాజు ఖండించారు. పట్టణంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఏపీలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల ఆదరణ చూరగొన్నాయన్నారు. వైఎస్ జగన్ పాలనలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ, కాపులు, అగ్రవర్ణాలలోని పేదలకు ఎంతో మేలు జరిగిందన్నారు. వారందరూ రాబోయే 2024 ఎన్నికలలో వైఎస్సార్ సీపీకే ఓటు వేసి రెండోసారి అధికారంలోకి తీసుకురావడం ఖాయం అన్నారు. ఈ సమావేశంలో పురుషోత్తం, శ్రీను, సునీల్, సందీప్ పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్ర పోటీలకు సీఎస్ఎన్ విద్యార్థినులు


విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: నెల్లూరు జిల్లా ఆత్మకూరులో జరగనున్న 67వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ బాల్ బ్యాడ్మింటన్ అండర్–19 బాలికల పోటీలకు భీమవరంలోని డాక్టర్ సీఎస్ఎన్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని కోచ్ దావుద్ ఖాన్ శుక్రవారం చెప్పారు. జి.శిరీష, సిహెచ్ ఇందుమతి పశ్చిమగోదావరి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారని తెలిపారు. ఈనెల 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు ఈ పోటీలు జరుగుతాయన్నారు. విద్యార్థినులను కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ చీడే సత్యనారాయణ, ప్రిన్సిపల్ ఎండీ సలీం ఖాన్ అభినందించారు.